# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 06-12-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

**1.** **దేశానికి ఆత్మగా నిలిచిన రాజ్యాంగాన్ని అందించిన మహోన్నత వ్యక్తి భారతరత్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కొనియాడారు.**

**2.** **ఇండిగో విమాన సర్వీసుల రద్దు వ్యవహారంలో ప్రయాణీకులకు ఇబ్బందులు లేకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని కేంద్రమంత్రి కె.రామ్మోహన్ నాయుడు తెలిపారు.**

**3.** **రాజకీయాల్లో నైతిక విలువలకు ప్రాధాన్యత ఇచ్చిన వ్యక్తి అటల్ బిహారీ వాజపేయి అని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ పేర్కొన్నారు.**

**4.** **రాష్ట్రానికి పెట్టుబడుల సాధనే లక్ష్యంగా ఈరోజు నుంచి 5 రోజుల పాటు అమెరికా, కెనడా దేశాల్లో రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ పర్యటించనున్నారు.**

**5.** **ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు.**

==========================

దేశానికి ఆత్మగా నిలిచిన రాజ్యాంగాన్ని అందించిన మహోన్నత వ్యక్తి భారతరత్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కొనియాడారు. బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుని స్మృతికి నివాళులర్పిస్తున్నట్లు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు.

విశాల భారతదేశంలో సామాజిక సంస్కరణలకు శ్రీకారం చుట్టిన మహనీయుడు బాబాసాహెబ్ బి.ఆర్.అంబేద్కర్ అని ఈరోజు ఆయన వర్ధంతి సందర్భంగా హృదయపూర్వకంగా అంజలి ఘటిస్తున్నట్లు ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

-------------------------

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశించిన సమాజ స్థాపన కోసం అందరూ సమిష్టిగా కృషి చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి కోరారు. సమానత్వం, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అంబేద్కర్ కృషి చేశారన్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఒంగోలులో ఈ రోజు అంబేద్కర్ విగ్రహానికి మంత్రి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ..

..వాయిస్..27 సెకన్లు

---------------------------

రాజకీయాల్లో నైతిక విలువలకు ప్రాధాన్యత ఇచ్చిన వ్యక్తి అటల్ బిహారీ వాజపేయి అని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు. విజయవాడలో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్. మాధవ్‌తో కలిసి అటల్ బిహారీ వాజపేయి శతజయంతి ఉత్సవాల పోస్టర్‌ను ఆయన ఈరోజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసవర్మ మాట్లాడుతూ.. సామాన్య కుటుంబంలో జన్మించి అసామాన్య వ్యక్తిగా ఎదిగిన మహా నేత వాజపేయి అని కొనియాడారు.

---------------------------

ఇండిగో విమాన సర్వీసుల రద్దు వ్యవహారంలో ప్రయాణీకులకు ఇబ్బందులు లేకుండా అవసరమైన అన్ని చర్యలను పౌరవిమానయాన మంత్రిత్వ శాఖ తీసుకుంటుందని ఆ శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. ప్రయాణీకుల భద్రత, సౌకర్యం ప్రాధాన్యత అంశాలుగా పేర్కొన్నారు. విమాన సర్వీసుల రద్దుపై ఢిల్లీలో ఆయన పాత్రికేయులతో మాట్లడుతూ..

వాయిస్... 21 సెక్లన్లు

---------------------------

రాష్ట్రానికి పెట్టుబడుల సాధనే లక్ష్యంగా ఈరోజు నుంచి 5 రోజుల పాటు అమెరికా, కెనడా దేశాల్లో రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ పర్యటించనున్నారు. తొలిరోజు డల్లాస్ లో తెలుగు డయాస్పోరా సమావేశంలో పాల్గొంటారని అధికారులు వెల్లడించారు. ఈ నెల 8, 9 తేదీల్లో శాన్ ఫ్రాన్సిస్కో వేదికగా పలు కంపెనీల ప్రతినిధులతో సమావేశమవుతారని, 10వ తేదీన కెనడాలోని టొరంటోలో పర్యటిస్తారని పేర్కొన్నారు.

---------------------------

ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. బాపట్ల జిల్లా అద్దంకి నియోజకవర్గం సంతమాగులూరులో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వై. సత్య కుమార్ యాదవ్‌తో కలిసి నిన్న పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ.. ఎన్నికల ముందు చెప్పిన హామీలన్నీ ప్రభుత్వం అమలు చేస్తున్నట్ల చెప్పారు.

---------------------------

విజయవాడ ఆకాశవాణి కేంద్రంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని ఈ రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకాశవాణి కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ జనరల్ సోమేశ్వరరావు మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి, సమసమాజ స్థాపన కోసం అంబేద్కర్ కృషి చేశారని పేర్కొన్నారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆకాశవాణి విజయవాడ కేంద్రం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

---------------------------

ఛత్తీస్‌గఢ్‌లో ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ–సర్ కార్యక్రమంలో భాగంగా.. ఇప్పటివరకు 2 కోట్ల 8 లక్షల 46 వేలకు పైగా గణన ఫారాలను డిజిటలైజ్ చేసినట్లు ఆ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి

యశ్వంత్ కుమార్ తెలిపారు. రాష్ట్రంలోని దాదాపు నమోదిత ఓటర్లు అందరికీ గణన ఫారాలు అందించబడ్డాయని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గిరిజనుల ఎక్కువగా నివశించే బస్తర్ డివిజన్‌లో, బూత్ లెవల్ అధికారులు మారుమూల ప్రాంతాలలోని ఓటర్లను చేరుకోవడానికి అన్ని ప్రయత్నాలు చేస్తున్నట్లు చెప్పారు. ఇంద్రావతి నది అవతల ఉన్నదట్టమైన అడవులతో కూడిన ప్రాంతాలకు చేరుకోవడానికి బిఎల్ఓ బృందాలకు పడవలు, స్టీమర్‌లను అందుబాటులో ఉంచినట్లు బీజాపూర్ డిప్యూటీ జిల్లా ఎన్నికల అధికారి ఎన్.ఆర్. గవేల్ వెల్లడించారు.

---------------------------

వారణాసిలో నిర్వహిస్తున్న కాశీ తమిళ సంగమానికి సుమారు లక్ష మంది హాజరయ్యే అవకాశం ఉన్నందున పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు నగర డిప్యూటీ పోలీస్ కమిషనర్ శరవణన్ తంగమణి తెలిపారు. భద్రతా చర్యల్లో భాగంగా పోలీసులతోపాటు డ్రోన్లను మోహరించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా వారణాసిలో పాత్రికేయులతో మాట్లాడుతూ.. నిఘా కోసం 2 వేల మందికి పైగా సిబ్బందిని కేటాయించినట్లు చెప్పారు.

---------------------------

తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025'కు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును తెలంగాణ రాష్ట్ర రహదారుల, భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి ఆహ్వానించారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో నారా చంద్రబాబు నాయుడుని నిన్న కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. అనంతరం మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి పాత్రికేయులతో మాట్లాడుతూ.. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్ 2025ను దావోస్ సమ్మిట్ తరహాలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ సంస్థల ప్రతినిధులు వ్యాపారవేత్తలు వివిధ రంగాలకు చెందిన నిపుణులు సదస్సుకు హాజరవుతున్నట్లు మంత్రి వివరించారు.

---------------------------

హోమ్ గార్డుల కుటుంబాలను ఆదుకోవడం కోసం ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబు తెలిపారు. విజయవాడలోని పెరేడ్ గ్రౌండ్‌లో 63వ హోమ్ గార్డుల వ్యవస్థాపక దినోత్సవాన్ని ఈరోజు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. పోలీస్ వ్యవస్థలో హోమ్ గార్డుల పాత్ర ప్రత్యేకమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పోలీసు సర్వీసుల్లో హోమ్ గార్డులు పనిచేస్తున్నారని తెలిపారు. వారు మరణిస్తే 5 లక్షల రూపాయల ఎక్స్ గ్రేషియాను ప్రభుత్వం ఇస్తోందన్నారు. కారుణ్య నియామకాలకు అవకాశం కల్పించడం జరిగిందని, మహిళా హోమ్ గార్డులకు ప్రసూతి సెలవులు ఇస్తున్నట్లు తెలిపారు.

---------------------------

దక్షిణ ఆఫ్రికా జట్టు భారత పర్యటనలో భాగంగా భారత్, దక్షిణ ఆఫ్రికా జట్ల మధ్య జరుగుతున్న వన్ డే సిరీస్‌లో మూడో వన్ డే మ్యాచ్ మరికొద్ది సేపట్లో ప్రారంభం కానుంది. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం వేదికగా ఈ మ్యాచ్ జరుగనుంది. టాస్ గెలిచిన భారత జట్టు ఫీల్డింగ్ ను ఎంచుకుంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానాంలో దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రానున్న రెండురోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి ఎమ్.వెంకట్రావు తెలియజేస్తూ,

వాయిస్..29 సెకన్లు

======================